VC NEWS

# వేగుచుక్క

పీడిత ప్రజల గొంతుక...

TELUGU DAILY NEWS

www.veguchukkanews.com

సోమవారం 18 మార్చి 2024

సంపుటి.01 సంచిక.215

వంద రోజుల్లో..
వంద తప్పులు..
కేటీఆర్ ట్వీట్



# నా రాజకీయం చూపిస్తా!



## నిజాంకు నకలు కేసీఆర్: సీఎం రేవంత్‌రెడ్డి

**భారాస ప్రభుత్వ హయాంలో నిజాం తరహాలో రాచరికాన్ని తీసుకురావాలని కేసీఆర్‌చూశారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు.**

హైదరాబాద్: భారాస ప్రభుత్వ హయాంలో నిజాం తరహాలో రాచరికాన్ని తీసుకురావాలని కేసీఆర్ చూశారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. తమ వారసులే అధికారంలో ఉండాలని నిజాం నవాబు కోరుకున్నారని.. కేసీఆర్ కూడా అలా చేయాలని భావించారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు 100 రోజులు పూర్తయిన సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన "వారసత్వాన్ని తమపై రుద్దాలని చూసినప్పుడు తెలంగాణ సమాజం ఏకమైంది. ప్రజలు దానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారు. కేసీఆర్ కుటుంబాన్ని అధికారం నుంచి దించారు. ప్రజాస్వామ్యంపై ఆయనకు నమ్మకం లేదు. ఏనాడూ ప్రజల స్వేచ్ఛను గౌరవించలేదు. నిజాం నకలునే కేసీఆర్ చూపించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను నాశనం చేశారు. 1948 సెప్టెంబర్ 17కు చరిత్రలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. 2023 డిసెంబర్ 3కూ అంతే ప్రాధాన్యం ఉంది. 1948 సెప్టెంబర్ 17న నిజాం రాచరిక పాలన అంతమైతే.. 2023 డిసెంబర్ 3న కేసీఆర్ పాలన పోయింది. నియంతలు ఎప్పుడూ సంస్కృతిని ధ్వంసం చేయాలని చూస్తారు. గత ప్రభుత్వంలో తెలంగాణ వాహన రిజిస్ట్రేషన్‌లో టీజీ బదులు టీఎస్ తీసుకొచ్చారు. టీఆర్ఎస్‌కు నకలుగానే టీఎస్‌ను తెచ్చారు. 'జయ జయహే తెలంగాణ' పాటను రాష్ట్ర గీతంగా గుర్తించలేదు. మా ప్రభుత్వంలో ధర్నా చౌక్‌లో నిరసనలకు అనుమతులు ఇచ్చాం. తెలంగాణ తల్లి విగ్రహంలో కూడా మార్పులు తీసుకొస్తున్నాం. రాష్ట్ర సంస్కృతి ఉట్టిపడేలా ఏర్పాటు చేస్తాం.

**రైతు భరోసాపై ఆందోళన వద్దు..**

అధికారంలోకి రాగానే ప్రగతి భవన్ గోడలు బద్దలుకొట్టాం. మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులకు పనిలో స్వేచ్ఛను ఇచ్చాం. 26 కోట్ల మంది మహిళలు ఇప్పటి వరకు ఉచిత బస్సు ప్రయాణం చేశారు. 32 లక్షల కుటుంబాలు 200 యూనిట్ల ఉచిత్ విద్యుత్ పథకాన్ని అందుకున్నాయి. రైతు భరోసా గురించి ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. 5 ఎకరాలు ఉన్న రైతుల వరకూ రైతుబంధు వారి ఖాతాల్లో పడింది. 62 లక్షల మందికి నగదు జమ చేశాం. ఇకపై గుట్టలు, రోడ్లు, బంగళాలు, లేఔట్లకు రైతు భరోసా ఇవ్వబోం. ఏ ప్రభుత్వ పథకం అందకపోయినా దరఖాస్తు చేసుకోవాలి.. పరిశీలించి అందిస్తాం.

**ప్రభుత్వాన్ని పడగొడతామంటే చూస్తూ ఊరుకుంటామా?**

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తామని భారాస, భాజపా నేతలు పదేపదే అంటున్నారు. వాళ్లు ప్రభుత్వాన్ని పడగొడతామంటే చూస్తూ ఊరుకుంటామా? కుక్కకాటుకు చెప్పుదెబ్బ అని పెద్దలు చెప్పారు.. కొట్టకుండా ఊరుకుంటామా?మేం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ఫిరాయింపులకు పాల్పడలేదు. ఈరోజు నుంచే నేనూ రాజకీయం ప్రారంభించాను. మా పార్టీలోకి పొద్దున్నే ఒక గేటు తెరిచా.. మొత్తం ఇంకా తెరవలేదు. ఇవాళ ఒక ఎంపీ, ఎమ్మెల్యేకు గేటు ఓపెన్ చేశాం. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నాకు మంచి మిత్రుడు. ఆయనకు బలహీనవర్గాల పట్ల నిబద్ధత ఉంది. టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌గా ఉండాలని కోరారు.. తిరస్కరించారు. కానీ.. కేసీఆర్ ఎలాంటి వారి నుంచైనా సగం బలం గుంజుకుంటారు. ప్రవీణ్‌కుమార్ భారాసలో చేరుతున్నారంటే నేనేమీ కామెంట్ చేయలేను" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

# కవిత తొలి రోజు ఈడీ విచారణ పూర్తి..

**ప్రశ్నల వర్షం కురిపించిన ఈడీ అధికారులు**

ఢిల్లీ: లిక్కర్ స్కామ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తొలిరోజు ఈడీ విచారణ ముగిసింది. తొలి రోజే ఆమెపై ఈడీ అధికారులు ప్రశ్నల వర్షం కురిపించారు. విచారణ ప్రక్రియను అధికారులు వీడియో రికార్డింగ్ చేశారు. ఆప్ కు ఇచ్చిన రూ. 100 కోట్ల ముడుపులు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. ఎవరెవరు డబ్బులు సమకూర్చారనే ఆధారాలను కూడా చూపిస్తూ ఆమెను ప్రశ్నించారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ ద్వారా సంపాదించిన రూ. 192 కోట్ల సంగతి ఏమిటని అడిగారు. డబ్బులు ఎక్కడెక్కడ పెట్టుబడులుగా పెట్టారని ప్రశ్నించారు. ఈడీ అధికారులు అడిగిన ప్రశ్నల్లో కొన్నింటికి సమాధానాలు చెప్పిన కవిత... మరి కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మౌనంగా ఉండిపోయారు.



**విచారణను వీడియో రికార్డింగ్ చేసిన అధికారులు**

**ఆప్ కు ఇచ్చిన రూ. 100 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్న**

**కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మౌనంగా ఉన్న కవిత**

# భారాసలో చేరుతున్నా

**బీఎస్పీకి రాజీనామా చేసిన ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ గులాబీ గూటికి చేరనున్నారు.**



**హైదరాబాద్:** బీఎస్పీకి రాజీనామా చేసిన ఆపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ గులాబీ గూటికి చేరనున్నారు. సోమవారం భారాస అధినేత కేసీఆర్ సమక్షంలో ఆయన గులాబీ కండువా వేసుకోనున్నారు."నా రాజకీయ భవితవ్యంపై హైదరాబాద్‌లో ఆదివారం వందలాది మంది అభిమానులు, శ్రేయోభిలాషులతో మేధోమధనం జరిపాను. ఏ నిర్ణయం తీసుకున్నా నా వెంటే నడుస్తానని మాట ఇచ్చిన అందరికీ ధన్యవాదాలు. తెలంగాణ విశాల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని, దేశంలో లౌకికత్వం, రాజ్యాంగ రక్షణ, బహుజనుల అభ్యున్నతి కోసం సోమవారం కేసీఆర్ సమక్షంలో ఆపార్టీలో చేరబోతున్నా. ఎక్కడున్నా బహుజన మహనీయుల సిద్ధాంతాన్ని గుండెల్లో పదిలంగా దాచుకుంటా. వాళ్ల కలలను నిజం చేసే దిశగా పయనిస్తా" అని ప్రవీణ్ కుమార్ ఈమేరకు ట్వీట్ చేశారు.

# కోటప్పకొండకు వెళ్తుండగా బస్సు బోల్తా.. 40 మందికి తీవ్ర గాయాలు

**పుట్టు వెంట్రుకల మొక్కు తీర్చుకునేందుకు పల్నాడు జిల్లా కోటప్పకొండకు వెళ్తున్న బస్సు బోల్తా పడింది.**



**అద్దంకి:** పుట్టు వెంట్రుకల మొక్కు తీర్చుకునేందుకు పల్నాడు జిల్లా కోటప్పకొండకు వెళ్తున్న బస్సు బోల్తా పడింది. ఈ ఘటన ఆదివారం అద్దంకి మండలం తిమ్మాయపాలెం వద్ద చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా తాళ్లూరు మండలం బొద్దికూరపాడు, దర్శి మండలం కొర్లమడుగు గ్రామాలకు చెందిన సుమారు 60 మంది కోటప్పకొండకు ఓ స్కూలు బస్సులో వెళ్తున్నారు.

# కాంగ్రెస్‌లో చేరిన ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే దానం నాగేందర్

**చేవెళ్ల ఎంపీ, భారాస నేత రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరారు.**

హైదరాబాద్: భారాసకు వరుస షాక్‌లు తగులుతున్నాయి. ఆ పార్టీకి చెందిన చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అంతకుముందు రంజిత్‌రెడ్డి భారాసకు రాజీనామా చేశారు. ప్రస్తుత రాజకీయ పరిణామాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు.



# మోదీ పాలనపై అభిమానంతోనే భాజపాలో చేరికలు

**ప్రధాని మోదీ పాలన పట్ల అభిమానంతోనే ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు భాజపాలో చేరుతున్నారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు.**

## కవిత అరెస్టుపై భారాస ఆందోళనలు సరికాదు

## కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

## కమలదళంలో చేరిన అరూరి రమేశ్



**హైదరాబాద్:** ప్రధాని మోదీ పాలన పట్ల అభిమానంతోనే ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు భాజపాలో చేరుతున్నారని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తూ దేశాన్ని అన్ని రంగాల్లో ప్రధాని ముందుకు తీసుకెళ్తున్నారని తెలిపారు. ఆదివారం భారాస మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్ భాజపాలో చేరారు. ఈ సందర్భంగానూ, సోమాజిగూడలో భాజపా లీగల్, లెజిస్లేటివ్ ఎఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎ.నర్సింహారెడ్డి అధ్యక్షతన జరిగిన 'అడ్వొకేట్స్ మీట్'లో, భాజపా రాష్ట్ర కార్యాలయంలో 'ప్రశ్నిస్తున్న తెలంగాణ' కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగానూ కిషన్‌రెడ్డి మాట్లాడారు. "తెలంగాణ రాజకీయాల్లో భారాస పని అయిపోయింది. ప్రస్తుతం భాజపాకు సానుకూల వాతావరణం ఉంది. మోదీ నాయకత్వానికి మద్దతు పెరుగుతోంది. రాష్ట్రంలో 17 లోక్‌సభ సీట్లు గెలిచేలా భాజపా కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి. రానున్న ఎన్నికల్లో భాజపా కూటమి 400కు పైగా సీట్లు సాధిస్తుంది. గడిచిన తొమ్మిదిన్నరేళ్లలో తెలంగాణ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షల కోట్లు ఖర్చు చేసింది. కాళేశ్వరంపై కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేయలేదు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటేయడం వల్ల ఆర్జీ(రాహుల్ గాంధీ) పన్ను పడుతోంది. ఇక్కడ బెదిరించి వసూలు చేసి.. వారికి పంపే ప్రయత్నం జరుగుతోంది. దీంతో వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు.

**కవిత అరెస్టుతో భాజపాకు సంబంధంలేదు**

ఎమ్మెల్సీ కవిత అరెస్టుతో భాజపాకు సంబంధం లేదు. ఆమె దిల్లీకి వెళ్లి ఒప్పందాలు చేసుకుంటే తెలంగాణకు సంబంధమేంటి? తెలంగాణ ప్రజల మేలు కోసం దిల్లీలో మద్యం వ్యాపారం చేశారా? 'మీరు సీఎం అయితే తొలి పనిగా ఏం చేస్తారు' అని ఓ ఛానల్ వారు అడిగితే మద్యాన్ని నిషేధిస్తానని కవిత అన్నట్లు ఓ వీడియో వైరల్ అవుతోంది. మద్యం కుంభకోణంపై భారాస నేతలు ప్రధానిపై విమర్శలు చేయడం హాస్యాస్పదం. కవితకు మద్దతుగా భారాస నాయకులు, కార్యకర్తలు ఆందోళనలు చేయడం సరికాదు. మద్యం గొలుసు దుకాణాల విషయంలో భారాస బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోంది.

**కాంగ్రెస్ హామీల అమలుకే గ్యారంటీ లేదు**

రాష్ట్రంలో కాంగ్రెస్ వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి.. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం తప్ప ఏదీ నెరవేర్చలేదు. పథకాలకు నిధులు ఎలా సమకూరుస్తారో వారికే తెలియదు. కాంగ్రెస్ డిక్లరేషన్‌లు, గ్యారంటీల పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేసే గ్యారంటీ లేకుండా పోయింది. మహిళలకు నెలకు రూ.2,500, రూ.2 లక్షల రుణమాఫీ, కౌలురైతులకు రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, వరికి రూ.500 బోనస్, నిరుద్యోగ భృతి, విద్యార్థినులకు స్కూటీలు, కొత్త రేషన్‌కార్డులు సహా కాంగ్రెస్ ఇచ్చిన పలు హామీలను అమలు చేయలేదు. హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని భాజపా ప్రశ్నిస్తూనే ఉంటుంది" అని కిషన్‌రెడ్డి అన్నారు.

**పీపుల్స్ మ్యానిఫెస్టోపై ప్రధాని యోచన: కె.లక్ష్మణ్**

సమాజంలో ఉన్న మేధావులు, కార్మికులు, కర్షకులు, మహిళల అభిప్రాయాలు తీసుకుని పీపుల్స్ మ్యానిఫెస్టో తేవాలని ప్రధాని మోదీ ఆలోచిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు, భాజపా జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు కె.లక్ష్మణ్ అన్నారు. 'అడ్వొకేట్స్ మీట్'లో ఆయన మాట్లాడారు. కొన్ని పార్టీలు ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయని.. కులాలు, మతాలు, ప్రాంతాల పేరిట లబ్ధి పొందే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. ఏపీ సాధ్యం కాకుంటే ఉచితాల పేరుతో ప్రజల్ని మభ్యపెడుతున్నారన్నారు. ఉచితాలు ప్రకటిస్తూ పోతే పన్నులు కట్టిన వారి పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో పార్టీ కండువా కప్పుకొంటేనే పథకాలు వర్తిస్తున్నాయని విమర్శించారు. అడ్వొకేట్స్ మీట్‌లో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో భాజపాలో చేరారు. వారికి కిషన్‌రెడ్డి, లక్ష్మణ్‌లు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమాల్లో భాజపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, నేతలు విజయరామారావు, ధర్మారావు, కొండేటి శ్రీధర్, సైదిరెడ్డి, రాంచందర్‌రావు, రంగారెడ్డి, కాసం వెంకటేశ్వర్లు, పార్టీ తెలంగాణ లీగల్ సెల్ అధ్యక్షుడు రామారావు, లీగల్ సెల్ ప్రతినిధి ఆంథోనిరెడ్డి, మాజీ మేయర్ సుభాష్ చందర్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎస్ఐ ట్రస్ట్ ఆస్థులు లీజ్ కు ఇవ్వడం అక్రమం.



**సిఎస్ఐ ఇంటర్, డిగ్రీ కళాశాల, డిచ్పల్లిలోని సిఎంసి మెడికల్ కళాశాలలను లీజ్ ఇవ్వడానికి వారికి ఎలాంటి హక్కు లేదు.**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి 17:**

చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా మెదక్ అధ్యక్ష మండల పరిధిలోని సిఎస్ఐ కళాశాల ప్రాంగణం లీజ్ కు ఇవ్వడానికి ససేమేరా ఒప్పుకోమని చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా ట్రస్ట్ అసోసియేషన్ బాధ్యులు అన్నారు. అర్ అండ్ బి గెస్ట్ హౌజ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాస్టరేట్ బోర్డ్ కన్వీనర్ దేవి నవీన్ మాట్లాడుతూ... నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కంటేశ్వర్ ప్రాంతంలో గల సి ఎస్ ఐ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఎందరో విద్యార్థులు విద్యను అభ్యసించి ఉన్నతంగా ఎదిగారన్నారు. మెదక్ అధ్యక్ష మండలి అని చెప్పుకునే వారు కొందరు డిసెంబర్ 30 ఎలక్షన్ లో ఎన్నికైన వారు ఉండగా ఇల్లీగల్ కమిటీ జనవరిలో మరో ఎలక్షన్ నిర్వహించి కొందరు స్థలాలను లీజ్ కు ఇస్తూ అన్యాయాలకు అక్రమాలకు పాల్పడుతున్నరని అన్నారు. ఈ విద్య సంస్థల స్థలాలను లీజ్ కు గాని అమ్మకానికి గాని ఇవ్వటం ఎవరికి అర్హత లేదని అన్నారు. ఒకవేళ లీజ్ తీసుకున్నా మీరు నష్టపోతారని సూచించారు. కోర్టు తగాదాలు ఉన్న కారణంగా ఇట్టి స్థలాలను లీగల్ గా లీజ్ కు ఇచ్చే అవకాశం ఎంత మాత్రము లేదని, డిచ్ పల్లిలో ఉన్న మెడికల్ కలశాలను సైతం లీజ్ ఇచ్చి వారి స్వలాభం పొందాలని కొందరు చూస్తున్నారని అన్నారు. ఇది ప్రజలకు సేవ చేయడం కోసం, సేవ అందించడం కోసం ఈ స్థలాలను ఏర్పాటు చేశారని, ఇది సంఘానికి తప్ప వేరే ఎవ్వరికీ దీనిపై రైట్స్ లేవని, అమ్మే అధికారం కూడా లేదని అన్నారు. ఎన్నికైన వారు మినిస్ట్రీ కి సంబందించిన పనులు మాత్రమే చేయాలని కానీ దానికి విరుద్ధంగా లీజులకు ఇస్తూ అన్యాయాలకు అక్రమాలకు పాల్పడుతున్నారని అన్నారు. లీజ్ తీసుకున్న వారు ఇచ్చిన డబ్బులు నష్టపోతారని ఈ సందర్భంగా హెచ్చరించారు. డిచ్ పల్లి మెడికల్ కాలేజీ, ఇంటర్ కాలేజీ ని లీజ్ ఇస్తున్నట్లు మా దృష్టికి వచ్చిందనీ దీనిని అడ్డుకుంటామని గుర్తు చేశారు. ట్రస్ట్ ప్రాపర్టీని ఎవరు కొనడానికి, అమ్మడానికి అర్హత లేదని ఎవరు అర్హులు లేరని అన్నారు. కొత్త విద్య సాగర్ మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సి ఎస్ ఐ జూనియర్, డిగ్రీ కళాశాల, డిచ్ పల్లి మెడికల్ కలశాల ఎంతో సేవలు అందించాయని, 1963లో సి ఎస్ ఐ అధీనంలోకి తీసుకొన్న ట్రస్ట్ లోకి తీసుకున్న ఏ స్థలాన్ని అయిన లీజ్ ఇవ్వడానికి లేదని, 1990 తరువాత ట్రస్ట్ మెదక్ డయాసిస్ ఆఫ్ ఎడ్యుకేషన్ సొసైటీ అక్రమంగా అప్పగించడం జరిగిందన్నారు. అక్కడ 1998 నుంచి ఇప్పటి వరకు మార్పులు చేర్పులు చేయకుండా కొందరు అక్రమంగా అధికారం చెలయిస్తున్నారన్నారు. అడ్మినిస్టేటర్ ఉన్న వ్యక్తి ఆక్రమాలు చేస్తున్నారని, రికగ్నైజేషన్ లేని ట్రస్ట్ ద్వారా మెదక్ సొసైటీ పై అక్రమాలు చేస్తున్న వారిపై, చీఫ్ సెక్రటరీకి,
జిల్లా కలెక్టర్ కు, ఇంటర్మీడియట్ అధికారికి ఫిర్యాదు అందజేసి, వీరిపై చర్యలు తీసుకోవాలని కోరనున్నట్లు తెలిపారు. ఈ సమస్యపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా కలవనున్నట్లు తెలిపారు. తప్పుడు పనులు చేసిన వారికి సంఘానికి అన్యాయం చేసే వారిపై క్రిమినల్ కేసులు వేస్తామని హెచ్చరించారు. లీజ్ ఇవ్వడానికి మీ దగ్గర జీ పి ఏ డాక్యుమెంట్ ఉందో చూపించాలని అన్నారు.

**లింగాల సునీల్ కుమార్** మాట్లాడుతూ.. సి ఎస్ ఐ ఆస్తులపై అక్రమాలకు పాల్పడుతూ లీజ్ ఇస్తూ అధిపతి పద్మారావు అనే వ్యక్తి కావాలనే తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని ఉద్దేశ్యంతో కుట్రలు చేస్తున్నారన్నారు. ఇంతకు ముందు పదేళ్ల క్రితం సి ఎస్ ఐ చర్చ్ ప్రాంగణం లీజ్ ఇవ్వాలని చూశారని అది ఇప్పటికీ కేసు నడుస్తుందని అన్నారు. సి ఎస్ ఐ కళాశాల ఆస్తులను ఇకపై కూడా లీజ్ కు ఇవ్వాలని చూస్తే ఇక మీ ఆటలు సాగనివ్వమని అన్నారు. ఒక వేళ లిజ్ కు ఇవ్వాలని చూస్తే చూస్తూ ఊరుకునేది లేదని, వారిపై ఎంతవరకైనా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇవన్నీ తెలిసినా లీజ్ తీసుకుంటే తప్పకుండా నష్టపోతారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ మీడియా సమావేశంలోపెద్ది దేవ సహాయం, తిట్ల అనిల్ రాజ్, గైని దేవదాస్, సాంసంగ్, మట్ట అనంతరావు, దార యోసేఫ్, బాబీ ప్రసాద్, అయిత రవి, లింగాల సునీల్ పాల్గొన్నారు.

# జిల్లాలో 20,071 ఎకరాలలో పంట నష్టం.

## - జిల్లా కలెక్టర్ జితెష్ వి పాటిల్.

**వేగుచుక్క న్యూస్,కామారెడ్డి, మార్చి 17**

జిల్లాలో గత రాత్రి కురిసిన వర్షం, వడగళ్ల వాన వల్ల జిల్లాలో 20,071 ఎకరాలలో పంట నష్టం జరిగిందని జిల్లా కలెక్టర్ జితెష్ వి పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 మండలాలలోని 130 గ్రామాలలో 14,553 రైతులకు చెందిన 20,071 ఎకరాలలో పంట నష్టం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ఇందులో ప్రధానంగా వరి, మొక్కజొన్న, జొన్న పంటలతో పాటు కొంతమేర గోధుమ, ఉల్లి, పప్పయ్య, మామిడి, కూరగాయ పంటలు దెబ్బతిన్నాయని ఆయన తెలిపారు . మండలాల్లోని మండల వ్యవసాయ అధికారుల నుంచి వచ్చిన తాత్కాలిక అంచనా నివేదిక మేరకు 33 శాతం లోపు వరి ధాన్యం 16,298 ఎకరాలలో, మొక్కజొన్న 2,784, జొన్న 705 ఎకరాలలో నష్టం వాటిల్లిందని, అట్టి నివేదికను ప్రభుత్వానికి సమర్పించడం జరిగిందని జిల్లా కలెక్టర్ పాటిల్ తెలిపారు.

# నష్టపోయిన పంటలను పరిశీలించిన ఎమ్మెల్యే .

**వేగుచుక్క న్యూస్, కామారెడ్డి, మార్చి 17**

అకాల వర్షం, వడగండ్ల వానతో నష్టపోయిన పంటలను ఎమ్మెల్యే వెంకట రమణ రెడ్డి ఆదివారం సందర్శించారు. నియోజకవర్గం పరిధిలోని దోమకొండ, బిక్నూర్, రాజంపేట, కామారెడ్డి రూరల్ మండలాల్లో సందర్శించి, రైతులతో మాట్లాడారు. పంట నష్ట పోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అయా మండలాల బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



# సగం ముద్రించిన కరెన్సీ నోట్లు.. మరోవైపు ఖాళీ..





పీకల్లోతు ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోన్న పాకిస్థాన్‌లో సెంట్రల్ బ్యాంకు బాధ్యతారాహిత్యం వెలుగులోకి వచ్చింది. కరెన్సీ నోట్ల ముద్రణ విషయంలో సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ నిర్లక్ష్యంగా వ్యవహరించింది. రూ.1,000, రూ.500 నోట్లను ఒకవైపే ముద్రించడంతో జనం ఖంగుతిన్నారు. బ్యాంకుల నుంచి విత్ డ్రా చేసిన కరెన్సీ నోట్లపై ఒకవైపు ఖాళీగా ఉండటంతో వాటిని తిరిగి ఇచ్చేస్తున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు వైరల్ కావడంతో సెంట్రల్ బ్యాంకు స్పందించింది. జనం మాత్రం దుమ్మెత్తిపోస్తున్నారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంతో కొట్టుమిట్టాడుతోన్న దాయాది పాకిస్థాన్‌లో కరెన్సీ నోట్ల ముద్రణా లోపం వెలుగులోకి వచ్చింది. ఒకవైపు మాత్రమే ముద్రించిన రూ. 1000, రూ.500 (పాకిస్థాన్ రూపాయి) నోట్లు చెలామణిలోకి రాగా.. వీటికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. సగం ముద్రించిన నోట్లను చూసి ఆ దేశ ప్రజలు షాకయ్యారు. దీనిపై ఫిర్యాదు పౌరులు చేయడంతో పాకిస్థాన్ సెంట్రల్ బ్యాంకు స్పందించింది. ఈ ఘటనపై విచారణకు ఆదేశించిన సెంట్రల్ బ్యాంకు.., వాటిని స్థానిక బ్యాంకులో మార్చుకోవాలని ప్రజలకు సూచించింది. కొద్దిరోజుల కిందట పాకిస్థాన్‌లో సగం ముద్రించిన నోట్లు అంటూ స్థానిక మీడియాలో వీడియోలు ప్రసారమయ్యాయి. వాటిలో బ్యాంకు నుంచి డ్రా చేసిన కొత్త నోట్లలో కొన్నింటిపై ముందు నగదు విలువ తెలియజేసేలా ఉండగా.. వెనుకవైపు తెల్లగా ఉండటంతో జనాలు బిత్తరపోయారు. వాటిని తిరిగి బ్యాంకు అధికారులకు అందజేశారు. బ్యాంకు మేనేజర్ మరికొన్ని సగం ముద్రించిన నోట్లను చూపించాడు. 'ఇప్పటికే ఎన్ని బండిల్స్ ఖాతాదారులకు ఇచ్చామో నాకు తెలియదు. ఇవి ఒక కస్టమర్ తిరిగి ఇచ్చాం.. ఆ తర్వాతే మేము ఈ విషయాన్ని తెలుసుకున్నాం.. ప్రతి బండిల్‌లో సగం ముద్రించిన నోట్లు కనీసం రెండు ఉన్నాయి ' అని టేబుల్‌పై ఉన్న కరెన్సీ నోట్లను ఆయన చూపించిన వీడియో వైరల్ అయ్యింది. దీనిపై స్పందించిన పాక్ సెంట్రల్ బ్యాంక్ ప్రకటన చేసింది. "నేషనల్ బ్యాంక్ ఆఫ్ పాకిస్థాన్‌కు పంపిన కొన్ని నోట్ల కట్టల్లో సగం ముద్రించిన నోట్లు వచ్చాయి.. ఒకవేళ బ్యాంకు నుంచి వాటిని ఎవరైనా తీసుకుంటే స్థానిక బ్రాంచ్‌లో మార్చుకోవాలి' అని కోరింది. ఈ సంఘటనతో సెంట్రల్ బ్యాంక్ పనితీరుపై పాక్ ప్రజలు తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. బ్యాంకులు, ఏటీఎంల నుంచి నగదు డ్రా చేసేటప్పుడు చాలా అప్రమత్తంగా ఉండాలని, ప్రతి నోట్‌ను పరిశీలించాలని ఎక్స్‌లో ఓ యూజర్ కామెంట్ పెట్టాడు. ఇది పాకిస్థాన్ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్ బాధ్యాతారాహిత్యమని మరో నెటిజన్ ధ్వజమెత్తాడు. గత రెండేళ్లుగా పాక్ ఆర్థిక వ్యవస్థ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కేందుకు అంతర్జాతీయ సంస్థల వద్ద రుణాల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. తాజాగా, ఘటనపై నేషనల్ బ్యాంక్ ఆఫ్ పాకిస్థాన్ అధికార ప్రతినిధిని మీడియా సంప్రదించగా ఆయన స్పందించడానికి నిరాకరించారు.

# మీడియా సెంటర్ ను ప్రారంభించిన కలెక్టర్

**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 17**



పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం(కలెక్టరేట్)లోని రూమ్ నెం.28 లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ (ఎం.సీ.ఎం.సీ)ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ తో కలిసి ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. మీడియా కోసం అందుబాటులో ఉన్న సదుపాయాలను, ఎంసిఎంసి పనితీరుకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పార్లమెంటు ఎన్నికలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాకు అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎంసిఎంసి సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలను ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంలో వాటిని లెక్కించడం, సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలు వంటి వాటిని సకాలంలో ఆమోదిస్తూ, మంజూరు చేయాలని సూచించారు. శాటిలైట్ ఛానెల్స్ లో వచ్చే వార్తలను పూర్తిస్థాయిలో రికార్డు చేయాలని అన్నారు. వార్తా పత్రికలు, ఈ-పేపర్‌లు, టెలివిజన్ ఛానెల్‌లు, స్థానిక కేబుల్ నెట్‌వర్క్‌లు, సోషల్ మీడియా, మూవీ హౌస్‌లు, సంక్షిప్త సందేశాలు, ఇతర ఆడియో-వీడియో విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసిఎంసి నుండి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే విడుదల చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రత్యేక దృష్టిసారించాలని, ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించిన పోస్టులపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని స్పష్టం చేసారు. ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించడానికి మీడియా సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ ఐ.ఏ.ఎస్ కిరణ్మయి, ట్రైనీ ఐ.పీ.ఎస్ చైతన్య రెడ్డి, అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు, జిల్లా పౌర సంబంధాల అధికారిణి ఎన్.పద్మశ్రీ, కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, ఎన్నికల పర్యవేక్షకుడు పవన్, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రచార సభలకు ముందస్తుగానే అనుమతి తీసుకోవాలి.

## - రాజకీయ పార్టీల ప్రతినిధులకు కలెక్టర్, సీ.పీ సూచన.



**వేగుచుక్క న్యూస్,నిజామాబాద్, మార్చి 17**

ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు, ఇతర కార్యక్రమాల కోసం ముందస్తుగానే దరఖాస్తు చేసుకుని అనుమతి పొందాల్సి ఉంటుందని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్, సీ.పీలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పార్లమెంటు ఎన్నికలలో ఓటింగ్ శాతం పెరిగేలా రాజకీయ పార్టీల తరపున కృషి చేయాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులోకి వచ్చిందని అన్నారు. రాజకీయ పార్టీలకు, నాయకులకు, అభ్యర్థులకు ఎన్నికల ప్రచార సభలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు అందిస్తామని, అయితే కనీసం 48 గంటల ముందు సువిధ పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతి ఉంటుందని, రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వినియోగించడానికి వీలులేదని అన్నారు. మతం, కులం, ప్రాంతీయ అంశాలను ప్రస్తావిస్తూ విద్వేషాలు చెలరేగేలా వ్యాఖ్యలు చేయడం నిషేధమని, ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడం, బెదిరింపులకు పాల్పడటం, తప్పుడు ప్రచారాలు చేయడంపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఆలయాలు, మసీదులు, చర్చిలు, ప్రార్థన స్థలాల్లో, పోలింగ్ కేంద్రాలకు 100 మీటర్ల పరిధిలో ప్రచారం నిర్వహించరాదని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో ఎం.సి.సి, సర్వేలెన్స్ బృందాలను, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను, వీడియో సర్వేలెన్సు బృందాలను, ఎం.సీ.ఎం.సీ కమిటీ, ఇతర కమిటీలను ఏర్పాటు చేశామని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిపై ఫిర్యాదులను 1950 టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా, సి-విజిల్ యాప్ ద్వారా చేయవచ్చని సూచించారు. ఎన్నికల షెడ్యూల్ వెలువడినందున రాజకీయ పార్టీలకు సంబంధించిన వాల్ రైటింగ్, ఫ్లెక్సీలు, హోర్డింగులు, ఫోటోలను ప్రభుత్వ కార్యాలయాల్లో 24 గంటల వ్యవధిలో, బస్ స్టాండ్, రైల్వే స్టేషన్ పెట్రోల్ బంక్ తదితర పబ్లిక్ ప్లేస్ లలో 48 గంటల వ్యవధిలో, అనుమతి లేని ప్రైవేట్ స్థలాలలో 72 గంటల వ్యవధిలో పూర్తి స్థాయిలో తొలగించాలన్నారు. కాగా, జిల్లాలో కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే సమయంలో ప్రింటింగ్ ప్రెస్ ఫోన్ నెంబర్, అదేవిధంగా ఎవరు ప్రింట్ చేయమన్నారు వారి ఫోన్ నెంబర్ తప్పనిసరిగా పేర్కొనాలని , ఈ అంశాన్నిఅన్ని ప్రింటింగ్ ప్రెస్ యజమానులు పాటించాల్సి ఉంటుందన్నారు. అలాగే ఎన్నికల ప్రచార ప్రకటనలు, కరపత్రాలలో ముద్రించే అంశాలు, ఇతర ప్రచార అంశాలకు సంబంధించి తప్పనిసరిగా ఎం.సీ.ఎం.సీ ద్వారా ముందస్తుగానే అనుమతి తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంగిస్తే ప్రజా ప్రాతినిధ్య చట్టం 1951 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని, దీనిని పరిగణలోకి తీసుకొని సజావుగా ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన రేట్ చార్ట్ ప్రకారం ఎన్నికల వ్యయాన్ని లెక్కించడం జరుగుతుందన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, ట్రైనీ ఐ.ఏ.ఎస్ కిరణ్మయి, ట్రైనీ ఐ.పీ.ఎస్ చైతన్య రెడ్డి, అదనపు డీసీపీ కోటేశ్వర్ రావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కెనడాలో మళ్లీ రెచ్చిపోయిన ఖలిస్థానీ మద్దతుదారులు..

భారత్ కెనడా మధ్య తలెత్తిన దౌత్యపరమైన వివాదం ఇంకా చల్లారడం లేదు. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత ఏజెంట్ల హస్తం ఉందని కెనడా ప్రధాని చేసిన వ్యాఖ్యలు రెండు దేశాల మధ్య తీవ్ర దుమారాన్ని రేపాయి. అయితే కెనడాలో ఉన్న ఖలిస్థాన్ మద్దతుదారులు.. భారత వ్యతిరేక నినాదాలతో హల్‌చల్ చేశారు. మారణాయుధాల తో భారత హై కమిషనర్ లక్ష్యంగా ఆందోళనలు చేశారు. వారిని కెనడా పోలీసులు అడ్డుకున్నారు. కెనడాలో మళ్లీ ఖలిస్థానీ మద్దతుదారులు రెచ్చిపోతున్నారు. భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అక్కడ ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఇక గతేడాది కెనడాలో హత్యకు గురైన ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ విషయంలో భారత్‌పై ఆరోపణలు రావడం.. ఖలిస్థానీ మద్దతుదారుల నిరసనలు మరింత పెరిగాయి. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉందని.. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు.. రెండు దేశాల మధ్య ఉన్న సత్సంబంధాలను దెబ్బతీశాయి. అప్పటి నుంచి ఖలిస్థాన్ మద్దతుదారులు.. భారత్ పట్ల, భారత రాజకీయ నేతలు లక్ష్యంగా తీవ్ర బెదిరింపులకు దిగిన ఘటనలు ఉన్నాయి. ఈ క్రమంలోనే తాజాగా మరోసారి నిజ్జర్ హత్యకు వ్యతిరేకంగా భారత్‌పై విమర్శలు గుప్పిస్తూ కెనడాలో ఖలిస్థానీ మద్దతుదారులు తీవ్ర ఆందోళనలు చేశారు.

కెనడా అల్బెర్టాలోని ఎడ్మోంటన్ ప్రాంతంలో భారీగా ఖలిస్థానీ మద్దతుదారులు చేరుకుని మంగళవారం తీవ్ర నిరసనలు వ్యక్తం చేశారు. కత్తులు, ఈటెలు, ఇతర మారణాయుధాలు తీసుకువచ్చి తీవ్ర కలకలం రేపారు. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యలో భారత ఏజెంట్ల పాత్ర ఉందని ఆరోపిస్తూ.. కెనడాలోని భారత హై కమిషనర్ సంజయ్ కుమార్ వర్మకు వ్యతిరేకంగా ఈ నిరసనలు చేపట్టారు. కొన్ని గంటల పాటు ఆపకుండా భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలోనే సంజయ్ కుమార్ వర్మకు వ్యతిరేకంగా తీవ్ర అనుచిత వ్యాఖ్యలు, నినాదాలు చేసినట్లు తెలుస్తోంది. మార్చి 11 వ తేదీన ఎడ్మోంటన్‌లో ఇండో కెనడియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. ఈ క్రమంలోనే ఖలిస్థానీ మద్దతుదారులను అడ్డుకునేందుకు, వారిని చెదరగొట్టేందుకు ఎడ్మోంటన్ పోలీసులు తీవ్రంగా ప్రయత్నించారు. ఇక భారత హై కమిషనర్ సంజయ్ కుమార్ వర్మ వాహనం వైపు దూసుకెళ్లేందుకు ప్రయత్నించిన ఖలిస్థానీ మద్దతుదారులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడ తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఖలిస్థాన్‌కు అనుకూలంగా.. భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న ఆందోళన కారులను అడ్డుకునేందుకు పోలీసులు తీవ్రంగా కష్టపడ్డారు. చివరికి వారిని అక్కడి నుంచి చెదరగొట్టి వెళ్లగొట్టారు. ఇక ఆ నిరసనలను కవర్ చేస్తున్న యాంటీ కరెప్షన్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌పై ఓ ఖలిస్థానీ మద్దతుదారుడు దాడి చేసేందుకు ప్రయత్నించాడు. ఈ విషయాన్ని స్వయంగా ఆ జర్నలిస్ట్ వెల్లడించాడు. ఆ వ్యక్తి వచ్చి తన కెమెరాను లాక్కున్నాడని.. తనను పక్కకు నెట్టేసినట్లు తెలిపాడు. పైగా తాను వారికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసినట్లు తన తోటి ఖలిస్థానీ మద్దతుదారులకు చెప్పినట్లు వివరించాడు. కానీ తాను మాత్రం దూరం నుంచే ఆ కార్యక్రమాన్ని కవర్ చేసినట్లు తెలిపాడు. అయితే అది గమనించిన ఓ పోలీస్ అధికారి.. అతడ్ని లాగేసినట్లు చెప్పాడు. హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత ఏజెంట్ల హస్తం ఉందని కెనడా ప్రధాని చేసిన ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. అవన్నీ అబద్ధాలని ఇప్పటికే చాలాసార్లు స్పష్టం చేసింది. ఖలిస్థాన్ ఉగ్రవాది అయిన హర్దీప్ సింగ్ నిజ్జర్‌ను కెనడాలోని ఓ గురుద్వారా వద్ద గత ఏడాది జూన్ 18 వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపారు. హర్దీప్ సింగ్ నిజ్జర్‌ను భారత్ మోస్ట్ వాంటెండ్ ఉగ్రవాదిగా అంతకుముందే ప్రకటించింది.

# ఉచిత హోమియో

# వైద్య శిబిరానికి విశేష స్పందన.













- హోమియో వైద్యం ఎంతో మంది ప్రాణాలను నిలబెట్టింది.
- వైద్య శిబిరం లో వక్తలు.
- డాక్టర్ వెంకట్ రెడ్డి, ప్రమీల దంపతులకు ఘన సన్మానం.







**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్, మార్చి17:**

కొంతమంది ప్రాణాపాయ స్థితిలో ఉన్న సందర్భంలో హోమియో మందుల ద్వారానే బతికి బయట పడ్డారని, సైడ్ ఎఫెక్ట్స్ లేని హోమియో వైద్యంపై ప్రజల్లో మరింత అవగాహన పెంచాల్సిన అవసరం ఉందని సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య అన్నారు.

ఆదివారం నగరంలోని హరిత నగర్ ఆకుల హన్మంతు మహిళా భవన్ లో "మానవతావాది ప్రముఖ హోమియో వైద్యులు డాక్టర్ వెంకట్ రెడ్డి" పదవి విరమణ చేసిన సందర్భంగా

ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్ ) నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరానికి కాలనీ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భాల ఆకుల పాపయ్య మాట్లాడుతూ, గల్లీలో చాలామంది అత్యవసర ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పుడు వెంకట్ రెడ్డి హోమియో వైద్యం ద్వారా వాళ్ళ ప్రాణాలను కాపాడుకొగలిగామని అన్నారు. అంతకుముందు కూడా కొంతమంది అనారోగ్య బారిన పడితే హోమియో మందులు వాడడం వల్లనే వారి జీవితాలను నిలబడ్డాయని గుర్తు చేశారు. ఇదే కాకుండా అల్లోపతిలో ఈరోజు మందులు అంటే వ్యాపార రంగంగా మారిందని, వైద్యం అంటేనే వ్యాపారం గా తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. హోమియో, ఆయుర్వేదం, యునాని లాంటి మందులు ప్రజలకు అందుబాటులో ఉండే ధరలలో చాలా ఉన్నాయని అన్నారు. ఇవి నయం చేసే మందులని ప్రజలు కొద్దీగా ఓపికతో వాటి వైపు చూస్తే ఖచ్చితంగా దాని ఫలితం తెలుస్తుందని అన్నారు.


డాక్టర్ వెంకట్ రెడ్డి లాంటి మానవతావాది 35 సంవత్సరాలుగా ప్రభుత్వ వైద్యం పేదలకు అందిస్తూనే మరోవైపు సెలవుల్లో కూడా పేదలకు అతి తక్కువ ఫీజుతో వైద్యం అందించి గొప్ప పేరును సంపాదించారని కొనియాడారు.

**డాక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ....**

ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి హోమియో వైద్యులు డాక్టర్ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు కొద్దిగా ఓపికతో తన శరీరాన్ని తాను కంట్రోల్లో పెట్టుకుంటే సగం రోగాలు రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు అన్నారు. హోమియో వైద్యంలో వాళ్ళ శరీరతత్వాన్ని వాళ్ళ ఆహారపు అలవాట్లను కరెక్ట్ గా డాక్టర్ కు తెలియజేసినట్లు అయితే డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ద్వారా ఎంతటి పెద్ద రోగాన్ని అయినా సరైన సమయంలో తగ్గించుకోవచ్చని తెలిపారు. ప్రతి చిన్న సమస్య నుంచి కుటుంబ, ఆర్థిక సమస్య వరకు టెన్షన్ పడితే అది పెద్ద సమస్యగా తయారు అయ్యి అనారోగ్యానికి దారి తీస్తుంది అని తెలిపారు. కుటుంబంలో అందరూ కలిసిమెలిసి సఖ్యతతో, ఒక మంచి అవగాహనతో ఉన్నప్పుడు చాలా మేరకు రోగాలు రాకుండా ఉంటాయని అన్నారు. ఆ విధంగా ఆలోచనతో ప్రజలు ఉన్నప్పుడే వైద్యానికి ఎక్కువ ఖర్చు చేసుకోవాల్సిన అవసరం ఉండదని వివరించారు.

అనంతరం వివిధ పార్టీల నాయకులు ప్రముఖులు డాక్టర్ వెంకట్ రెడ్డి, ప్రమీల దంపతులను సన్మానించారు. వైద్య శిబిరంలో డాక్టర్ స్పందన ఉచిత వైద్యం అందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఏనుగందుల మురళి, కార్మిక సంఘ నాయకులు సిద్ధి రాములు, ఆకుల సత్యనారాయణ, జర్నలిస్ట్ లు పాకాల నర్సింలు, కుంచె వెంకటేష్, పివైఎల్ జిల్లా అధ్యక్షులు వనమాల సత్యం, రమేష్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు అరుణ, సరిత, నర్సవ్వ, సబితా, పిడిఎస్ యు నాయకులు జన్నారపు రాజేశ్వర్, ఇఫ్టు నాయకులు శివ, రవి, రాజన్న, లతో పాటు స్నేహితులు, న్యాయవాదులు, రిటైర్డ్ ఉద్యోగులు, శ్రీనగర్(పాల్దా) గ్రామ ప్రజలు డాక్టర్ వెంకట్ రెడ్డి పదవీ విరమణ చేసిన సందర్భంగా ఘనంగా సన్మానించారు.

# టాలీవుడ్ బ్రదర్స్ టైప్పు



జాతీయ అవార్డు గ్రహీత, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన వ్యాఖ్యతో అటు బాలీవుడ్ ప్రముఖుల దృష్టిని ఆకర్షించాడు. భారతీయ చలనచిత్ర పరిశ్రమలో బాలీవుడ్, టాలీవుడ్ అన్నదమ్ముల తరహా అని వ్యాఖ్యానించారు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్. తద్వారా తనలోని సోదరభావాన్ని ప్రకటించాడు. సౌత్ – నార్త్ డిబేట్ నేపథ్యంలో దేశంలోని ఒక పెద్ద పాన్ ఇండియా స్టార్ వ్యాఖ్య ఇప్పుడు ఫిలింసర్కిల్స్ లో హాట్ టాపిక్‌గా మారింది. జాతీయ అవార్డు గ్రహీత, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన వ్యాఖ్యతో అటు బాలీవుడ్ ప్రముఖుల దృష్టిని ఆకర్షించాడు. ఇటీవలి ఇంటర్వ్యూలో అల్లు హీరో బాలీవుడ్ తో పోలుస్తూ, దక్షిణ భారత సినిమా ఎదుగుదల డామినేషన్ గురించి జరుగుతున్న చర్చను ఉఠంకించారు. తనకు టాలీవుడ్..బాలీవుడ్ అనే తేడా లేదు. బాలీవుడ్ అంటే అపారమైన గౌరవం ఉందని అల్లు అర్జున్ చెప్పకనే చెప్పాడు. మొత్తం భారతీయ చలనచిత్ర పరిశ్రమను ఒక సంస్థగా భావించే బన్ని బాలీవుడ్‌ను ఒక చిన్న రఫ్ ప్యాచ్ కోసం విమర్శించడం అన్యాయం. దశాబ్దాలుగా హిందీ పరిశ్రమ మనకు అద్భుతమైన సినిమాలను అందించిందని అన్నారు. ఇరు పరిశ్రమల మధ్య పరస్పర గౌరవం ఉండాలని కోరుకున్నారు. సౌత్– బాలీవుడ్ సినిమాలు ఒకదానితో ఒకటి బాగా ప్రభావితం అవుతాయి. మేం విభిన్న ప్రాంతాల నుండి సోదరులలాగా కలిసి మెలిసి ఒకరికొకరు అపార గౌరవంతో పని చేస్తున్నాం అని వ్యాఖ్యానించాడు. ముంబై కోకిలాబెన్ ఆసుపత్రిలో అమితాబ్ పుష్ప: ది రైజ్‌చిత్రంతో అల్లు అర్జున్ పేరు ఉత్తరాదినా మార్మోగింది. అతడు ఒక్కో సినిమాతో అనూహ్యంగా ఎదుగుతున్నాడు.15 ఆగస్ట్ 2024న థియేటర్లలోకి రానుంది. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం తన పాన్ ఇండియా స్టార్ డమ్ ని మరింత విస్తరిస్తుందని ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ భావిస్తున్నారు. అల్లు అర్జున్, రష్మిక మందన్న, ఫహద్ ఫాజిల్ ఇందులో తమ పాత్రలను పునరావృతం చేస్తారు. దిశా పటాని ఇందులో ప్రత్యేక పాత్రలో నటిస్తోంది. ఈ సీక్వెల్ గంధపు చెక్కల స్మగ్లింగ్ నేపథ్యంలో తెరకెక్కింది.

# అవకాశం సద్వినియోగం చేసుకుందా?



ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్‌గా పరిచయం అయిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. ఊహలు గుసగుసలాడే సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ గా పరిచయం అయిన ముద్దుగుమ్మ రాశి ఖన్నా. ఈ అమ్మడు తెలుగు లో పలువురు యంగ్ హీరోలతో నటించి మెప్పించింది. అయితే ఈ మధ్య కాలంలో మాత్రం ఈ అమ్మడికి టాలీవుడ్ నుంచి ఆశించిన స్థాయిలో ఆఫర్లు రావడం లేదు. ఇదే సమయంలో బాలీవుడ్ లో ప్రయత్నాలు చేసిన ఈ అమ్మడికి అవకాశాలు దక్కాయి. తాజాగా సిద్దార్థ్ మల్హోత్రా హీరోగా రూపొందిన యోధ సినిమాలో రాశి ఖన్నా నటించింది. నేడు యోధ సినిమా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. యోధ సినిమా ఫలితం పై ఆధారపడి రాశి ఖన్నా హిందీ కెరీర్ ఆధారపడి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. గత వారం పది రోజులుగా యోధ సినిమా కోసం సిద్దార్థ్ మల్హోత్ర తో కలిసి ఉత్తర భారతంలో ప్రమోషన్ కోసం పలు కార్యక్రమాల్లో పాల్గొంది. ఆ సమయంలో యోధ సినిమా పై రాశి ఖన్నా చాలా నమ్మకం ను వ్యక్తం చేసింది. 14 ఏళ్ల తర్వాత హిందీలో చేసిన సినిమా అంటూ కూడా ఆమె ప్రచారం చేసింది. బాలీవుడ్ లో యంగ్ స్టార్ హీరో సిద్దార్థ్ మల్హోత్రా తో నటించే అవకాశం ను దక్కించుకున్న ఈ అమ్మడికి సక్సెస్ దక్కి మరిన్ని ఆఫర్లు వస్తాయా అనేది చూడాలి. బాలీవుడ్ లో ఇప్పటికే ఒకటి రెండు సినిమాలు కమిట్ అయ్యిందనే వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై మరింత స్పష్టత రావాల్సి ఉంది.

# ఆసుపత్రిలో అమితాబ్




అమితాబ్ గుండె మీద కాకుండా అతని కాలులోని గడ్డపై యాంజియోప్లాస్టీ నిర్వహించారని తెలిసినట్టు సదరు కథనం పేర్కొంది. బిగ్ బి అమితాబ్ బచ్చన్ ఆసుపత్రిలో చేరారు. 81 ఏళ్ల బిగ్ బి ముంబైలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో చేరారని ప్రముఖ జాతీయ మీడియా వెల్లడించింది. అమితాబ్ బచ్చన్ పరిధీయ(పెరిఫెరల్) గుండె కోసం చికిత్స పొందారు.. కరోనరీ హార్ట్ కోసం కాదు! అని కూడా సదరు జాతీయ మీడియా న్యూస్ 18 కథనం వెలువరించింది. అమితాబ్ గుండె మీద కాకుండా అతని కాలులోని గడ్డపై యాంజియోప్లాస్టీ నిర్వహించారని తెలిసినట్టు సదరు కథనం పేర్కొంది. ఆసుపత్రిలో చేరడానికి ఒక గంట ముందు బిగ్ బిలో ఒక పోస్ట్‌ను షేర్ చేసారు. ఇటీవల కనిపించిన వీడియోను కూడా బిగ్ బి షేర్ చేసారు. ఆంఖ్ ఖోల్కే దేఖ్ లో, కాన్ లగాకే సన్ లో, మార్ఖో ముంబై కి హెూగీ జై జైకార్, యే బాత్ అబ్ మాన్‌లో! అని అమితాబ్ మ్యాచ్ సమయంలో కొడుకు అభిషేక్ బచ్చన్‌తో కొన్ని మరపురాని క్షణాలను కలిగి ఉన్న వీడియోను షేర్ చేసారు. ఈ ఏడాది ప్రారంభంలో అమితాబ్ బచ్చన్ తన మణికట్టుకు శస్త్రచికిత్స చేయించుకున్నారు. 2024 జనవరిలో తన బ్లాగ్‌లో అమితాబ్ ఇలా రాసారు. ఐఎస్‌పిఎల్ ను ప్రకటనలతో ప్రమోట్ చేసాం. ఫలవంతమైన మార్గంలో ఉంది. ఇందులో పాల్గొన్న యజమానులు సభ్యులందరూ చిరస్థాయిగా కలిసి ఉండాల్సిన అవసరం ఉందిఅని రాసారు. అయితే అమితాబ్ చేతికి సర్జరీ అయినా కానీ తన తదుపరి ప్రాజెక్టల షూటింగుల్లో పాల్గొన్నారు. ఇటీవలి అమితాబ్ కూడా కోవిడ్ –19 తో పోరాడాడు. ప్రాజెక్ట్ కే (కల్కి) ప్రమోషన్స్ కోసం 2023 కామిక్ కాన్ కోసం శాన్ డియాగోకు ప్రయాణించకుండా అనారోగ్య సమస్యలున్నాయని అప్పట్లో వెల్లడించాడు. అమితాబ్ కల్కి 2989 చిత్రంలో నటిస్తున్న సంగతి తెలిసిందే. సౌత్ – నార్త్ లో పలువురు అగ్ర కథానాయకుల సినిమాల్లో అమితాబ్ నటిస్తున్నారు.

# బుస్ బుస్ స్నేక్ బాబోయ్!



సిల్క్ ప్యాంట్ ధరించిన పీసీ దానికి కాంబినేషన్ గా స్టైలిష్ వైట్ క్రాప్ టాప్ ధరించి అందాల ఆరబోతతో బోల్డ్ గా కనిపించింది. అమెరికా కోడలు ప్రియాంక చోప్రా ముంబైలో అడుగుపెట్టింది. చాలా కాలానికి పుట్టింటికి తిరిగి వచ్చింది. ఇంతకీ దేనికోసం ఇలా వచ్చింది? అంటే.. ఒక లగ్జరీ బ్రాండ్ ఈవెంట్ కోసం ముంబైలో అడుగుపెట్టిన పీసీ.. ఇక్కడ అడుగుపెడుతూనే మైండ్ బ్లాక్ చేసింది. స్టిల్ ఫోటోగ్రాఫర్లు తన వెంట పడి మరీ ఫోటోషూట్లు చేసారు. తాజాగా రిలీజైన ఫోటోల్లో పీసీ రూపం కుర్రకారు గుండెల్లో గుబులు పెంచింది. సిల్క్ ప్యాంట్ ధరించిన పీసీ దానికి కాంబినేషన్ గా స్టైలిష్ వైట్ క్రాప్ టాప్ ధరించి అందాల ఆరబోతతో బోల్డ్ గా కనిపించింది. పోనీటైల్ హెయిర్ కట్, హైహీల్స్ లో స్పెషల్ గా కనిపించింది. దాదాపు ఏడాది తర్వాత భారతదేశాన్ని సందర్శించిన ప్రియాంక చోప్రా ప్రత్యేక కార్యక్రమంలో కెమెరాల ముందు నవ్వుతూ కనిపించింది. కెమెరాల వైపు చూస్తూ నమస్తే అంటూ అందరినీ పలకరించింది. తన లేటెస్ట్ విహారయాత్రకు సంబంధించిన ఫోటోలు వీడియోలు ఇన్‌స్టాలో వైరల్ గా షేర్ అవుతున్నాయి. అభిమానులు వ్యాఖ్యల విభాగంలో ప్రశంసల్లో ముంచేస్తున్నారు. ఇక అందరి కళ్లు పీసీ మెడలో ఉన్న ఆ గోల్డెన్ స్నేక్ నెక్లెస్ పైనే నిలిచాయి. ఒక పామును మెడలో వేసి చుట్టేసినట్టుగా ఎంత అందంగా డిజైన్ చేసారు? రియల్లీ స్టన్నింగ్ అంటూ ఫ్యాన్స్ ప్రశంసిస్తున్నారు. పీసీ మెడలో నెక్లెస్ చూసి పాము అనుకున్నాను అని ఒకరు వ్యాఖ్యానించగా, ఆ నెక్లెస్.. బుస్ బుస్ స్నేక్ బాబోయ్! అంటూ మరొకరు కొంటెగా కామెంట్ చేసారు. బల్గారీ స్టోర్ గ్రాండ్ లాంచ్ కోసం ప్రియాంక చోప్రా ముంబైలో అడుగుపెట్టడానికి కారణం.. ఈ కార్పొరేట్ కు ప్రపంచ బ్రాండ్ అంబాసిడర్‌లలో పీసీ కూడా ఒకరిగా ఉన్నారు.. ఇతర అంబాసిడర్‌లలో అన్నే హాత్వే, జెండయా, లిసా వంటి స్టార్లు ఉన్నారు. ప్రియాంక తన ఇన్‌స్టాలో తాను భారతదేశానికి ప్రయాణమవుతున్నానని ప్రకటించింది. తన కుమార్తె మాల్తీతో కలిసి ఉన్న సెల్ఫీని పీసీ షేర్ చేసింది.ముంబయి మేరీ జాన్.. ఇదిగో! అని వ్యాఖ్యానించింది. ఆ ఫోటోలు వైరల్ అయ్యాయి. కొన్ని గంటల తర్వాత తల్లీ కూతుళ్లిద్దరూ ముంబై విమానాశ్రయంలో కనిపించారు. కొద్దిసేపటికే వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ తర్వాత ప్రియాంక బీచ్ లో టోపీ ధరించి నలుపు రంగు దుస్తుల్లో కనిపించిన ఫోటోలు వైరల్ అయ్యాయి. అక్కడ మాల్తీ ఆకుపచ్చ టాప్ ప్యాంటు కాంబోలో కనిపించింది. ప్రియాంక తన కూతురిని ఈసారి కెమెరాల ముందు దాచలేదు. తన కారులోకి వెళ్ళే ముందు ఫోటోగ్రాఫర్స్ అందరినీ ఆప్యాయంగా పలకరించింది. మాల్టీ భారత్‌లో పర్యటించడం ఇది రెండోసారి. గత ఏడాది ఏప్రిల్‌లో నీతా ముఖేష్ అంబానీ కల్చరల్ సెంటర్ లాంచ్ కోసం నిక్ – ప్రియాంక తమ చిన్నారి మాల్తీని వెంట తీసుకొచ్చారు.

# మనసంతా ప్రియురాలే!



టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ తమ్ముడిగా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు ఆనంద్ దేవరకొండ. టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ తమ్ముడిగా సినీ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు ఆనంద్ దేవరకొండ. అతి తక్కువ సినిమాలతోనే మంచి గుర్తింపు సంపాదించుకున్నారు. కెరీర్ స్టార్టింగ్ నుంచి విభిన్నమైన పాత్రలు ఎంచుకుంటూ.. తనదైన శైలిలో అలరిస్తున్నారు. తన రూటే సెపరేట్ అన్నట్లు వరుస సినిమాలు చేస్తున్నారు. రీసెంట్ గా బేబీ మూవీతో బ్లాక్ బస్టర్ హిట్ ను సొంతం చేసుకున్నారు. సాయి రాజేష్ డైరెక్షన్లో తెరకెక్కిన కల్ట్ లవ్ స్టోరీ బేబీ.. గతేడాది రిలీజై బాక్సాఫీస్ వద్ద అనేక రికార్డులు సృష్టించింది. తక్కువ బడ్జెట్ తో రూపొంది.. భారీ లాభాలు సంపాదించింది. రెండు నెలల పాటు థియేటర్లలో రన్ అయిన ఈ మూవీతో ఆనంద్ దేవరకొండ కెరీర్ మలుపు తిరిగింది. ఇప్పుడు ఆయన మరో లవ్ స్టోరీ డ్యూయెట్ తో తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమవుతున్నారు. యూత్ ఫుల్ లవ్ ఎంటర్టైనర్ గా తెరకెక్కుతున్న ఈ సినిమాతో మిథున్ వరదరాజ కృష్ణన్ డైరెక్టర్ గా పరిచయమవుతున్నారు. హాయ్ నాన్న ఫేమ్ రితికా నాయక్ హీరోయిన్ గా నటిస్తోంది. తాజాగా డ్యూయెట్ నుంచి క్రేజీ అప్డేట్ వచ్చింది. ఆనంద్ దేవరకొండ బర్త్ డే సందర్భంగా మేకర్స్ స్పెషల్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. యంగ్ హీరోకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఆనంద్ పోషిస్తున్న మదన్ క్యారెక్టర్ లుక్ ను రివీల్ చేశారు. మనసంతా ప్రియురాలను నింపుకున్న యువకుడిగా ఆనంద్ దేవరకొండ ఈ లుక్ లో కనిపిస్తున్నారు. పోస్టర్ అంతా ఆనంద్ ఉండగా.. మధ్యలో హీరోయిన్ కారిడార్ వద్ద నవ్వుతూ కనిపిస్తోంది. ప్రస్తుతం ఈ పోస్టర్ కు సోషల్ మీడియాలో మంచి రివ్యూలు వస్తున్నాయి. చాలా రిఫ్రెషింగ్ గా ఉందంటూ కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు. త్వరలో ఈ సినిమా ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేస్తామని కూడా మేకర్స్ అనౌన్స్ చేశారు. ప్రస్తుతం డ్యూయెట్ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ ఏడాదే విడుదల కానుంది. స్టూడియో గ్రీన్ బ్యానర్ పై భారీ బడ్జెట్ తో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. సహా నిర్మాతగా మధుర శ్రీధర్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. జీవీ ప్రకాశ్ సంగీతాన్ని అందిస్తున్నారు. డిఫరెంట్ ప్రేమ కథగా రూపొందుతున్న ఈ డ్యూయెట్ సినిమాతో ఆనంద్ దేవరకొండ ఎలా అలరిస్తారో చూడాలి మరి.

# ఆ హిట్ సీక్వెల్‌కి చాలా టైం పట్టేనా..?

ఈ ఏడాదిలో ఖైదీ సీక్వెల్ ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని అంతా అనుకున్నారు. తమిళ స్టార్ హీరో కార్తీ, లోకేష్ కనగరాజ్ కాంబినేషన్ 2019లో వచ్చిన ఖైదీ సినిమా పాన్ ఇండియా రేంజ్ లో భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. అప్పటి నుంచి ప్రేక్షకులు ఖైదీ సీక్వెల్ కోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఖైదీ తర్వాత లోకేష్ కనగరాజ్ గ్రాఫ్ అమాంతం పెరిగింది. దాంతో ఖైదీ సీక్వెల్ కి మరింత క్రేజ్ పెరిగింది. ఈ ఏడాదిలో ఖైదీ సీక్వెల్ ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయని అంతా అనుకున్నారు. కానీ ఇప్పటి వరకు అందుకు సంబంధించిన ఎలాంటి హడావుడి లేదు. తాజాగా లోకేష్ కనగరాజ్ పుట్టిన రోజు జరిగింది. ఆ సమయంలో ఖైదీ సీక్వెల్ పై ప్రకటన ఉంటుందని అంతా భావించారు. కానీ నిరాశే మిగిలింది. ఖైదీ నిర్మాణ సంస్థ నుంచి లోకేష్ కనగరాజ్ కు పుట్టిన రోజు శుభాకాంక్షలు చెబుతూ ఒక పోస్టర్ ను విడుదల చేయడం జరిగింది. కానీ అందులో ఖైదీ 2 విషయమై ఎలాంటి అప్‌డేట్ ఇవ్వలేదు. దాంతో ఫ్యాన్స్ నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాదిలో అసలు ఖైదీ 2 ఉంటుందా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రస్తుతం దర్శకుడు లోకేష్ కనగరాజ్ తలైవర్ 171వ సినిమాని



రూపొందించే పనిలో ఉన్నాడు. బాలీవుడ్ స్టార్స్ రణవీర్ సింగ్ కీలక పాత్రలో నటిస్తున్న తలైవర్ 171 తర్వాత ఖైదీ 2 సినిమాను పట్టాలెక్కించే అవకాశాలు ఉన్నాయి. మరో వైపు విక్రమ్ మరియు లియో సీక్వెల్ లు కూడా ఉంటాయని సమాచారం అందుతోంది. విక్రమ్ తర్వాత లియో తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన లోకేష్ కనగరాజ్ ఆ స్థాయిలో మెప్పించడం లో విఫలం అయ్యాడు. లోకేష్ కనగరాజ్ మార్క్ మిస్ అయ్యింది .



# నిన్న డాన్స్ నేడు ఫైట్..!

విజయ్ బిన్నీ కొరియోగ్రఫీ అందించిన పాట చిత్రీకరణ నిన్నటితో పూర్తి అయ్యింది. మెగాస్టార్ చిరంజీవి హీరోగా త్రిష హీరోయిన్ గా బింబిసార దర్శకుడు వశిష్ఠ దర్శకత్వంలో రూపొందుతున్న విశ్వంభర సినిమా విడుదలకు ఇంకా చాలా సమయం ఉంది. అయితే షూటింగ్ మాత్రం బ్రేక్ లేకుండా స్పీడ్ గా సాగుతోంది. నిన్నటి వరకు ఫ్యామిలీ ఫంక్షన్ సాంగ్ చిత్రీకరణ జరిపారు. విజయ్ బిన్నీ కొరియోగ్రఫీ అందించిన పాట చిత్రీకరణ నిన్నటి తో పూర్తి అయ్యింది. ఆ షెడ్యూల్ పూర్తి చేసి కనీసం ఒక్క రోజు కూడా గ్యాప్ తీసుకోకుండా చిత్ర యూనిట్ సభ్యులు నేటి నుంచి యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కోసం ఏర్పాట్లు చేస్తున్నారట. భారీ యాక్షన్ సన్నివేశాల కోసం ప్రీ ప్రొడక్షన్ వర్క్ జరుగుతున్నట్లుగా సమాచారం అందుతోంది. పాట చిత్రీకరణకు ముందు ఒక యాక్షన్ సన్నివేశాన్ని చిరంజీవి పై చిత్రీకరించిన విషయం తెల్సిందే. ఇప్పుడు మరో యాక్షన్ సన్నివేశం చిత్రీకరణ కోసం దర్శకుడు సిద్ధం అవుతున్నాడు. చూస్తుంటే ఈ సినిమాలో భారీ యాక్షన్ సన్నివేశాలు పుష్కలంగా ఉన్నాయని, చిరంజీవి మార్క్ యాక్షన్ చూడబోతున్నామని ఫ్యాన్స్ అంటున్నారు. ఈ చిత్రంలో చిరంజీవి కి ఐదుగురు చెల్లెలు ఉంటారట. విభిన్నమైన సోషియో ఫాంటసీ కథాంశంతో ఈ సినిమా ను దర్శకుడు వశిష్ఠ రూపొందిస్తున్నాడు.

# ఫ్యాన్స్‌కు నచ్చట్లే బుచ్చిబాబు!





కానీ రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ సినిమా ఆలస్యం కావడంతో బుచ్చిబాబు కూడా రామ్ చరణ్ కోసం చాలా రోజులపాటు ఎదురు చూడాల్సి వచ్చింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్ తన 16వ సినిమాను బుచ్చిబాబు దర్శకత్వంలో స్టార్ట్ చేయబోతున్న విషయం తెలిసిందే. ఎప్పటినుంచో వెయిటింగ్ లిస్టులో ఉన్న ఈ ప్రాజెక్టు మొత్తానికి సెట్స్ పైకి రాబోతోంది. అసలైతే గత ఏడాదిలోనే ఈ సినిమా ప్రాజెక్టు మొదలు కావాల్సింది. కానీ రామ్ చరణ్ గేమ్ ఛేంజర్ సినిమా ఆలస్యం కావడంతో బుచ్చిబాబు కూడా రామ్ చరణ్ కోసం చాలా రోజులపాటు ఎదురు చూడాల్సి వచ్చింది. ఇక మొత్తానికి సరైన ప్లాన్ సెట్ కావడంతో ఈ ప్రాజెక్టును మార్చి 20వ తేదీన మొదలుపెట్టబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ పనులు చాలా వరకు పూర్తి చేసుకున్న దర్శకుడు ఇప్పుడు రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ చేసి రెండు కీలకమైన ఎపిసోడ్స్ ను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. ఒక సీరియస్ డ్రామా సీన్ తోనే షూటింగ్ మొదలు కాబోతున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఈ సినిమాకు టైటిల్ కూడా ఇప్పటికే ఫిక్స్ చేసినట్లుగా తెలుస్తోంది. అయితే రామ్ చరణ్ మాత్రం ఇంకా ఆ టైటిల్ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని సమాచారం. దర్శకుడు బుచ్చిబాబు కథకు తగ్గట్టుగా 'పెద్ది' అనే టైటిల్ అనుకున్నట్లుగా తెలుస్తోంది. అయితే ఇదే టైటిల్ తో గతంలో ఎన్టీఆర్ తో కూడా ఒక సినిమా రాబోతుంది అని చాలా రకాల గాసిప్స్ అయితే వచ్చాయి. అది కూడా బుచ్చిబాబు డైరెక్ట్ చేసే అవకాశం ఉందని కూడా ఇండస్ట్రీలో టాక్ అయితే వినిపించింది. నిజానికి బుచ్చిబాబు మొదట ఎన్టీఆర్ తోనే సినిమా చేయాలని అనుకున్నాడు. కానీ అతను రిజెక్ట్ చేయడంతోనే ఆ కథ రామ్ చరణ్ వద్దకు వెళ్ళింది అని కొన్ని మార్పులతో దర్శకుడు సరికొత్తగా సినిమా షూటింగ్ స్టార్ట్ చేయబోతున్నట్లుగా మరొక రకమైన టాక్ అయితే వినిపిస్తోంది. ఇక ఇది ఎంతవరకు నిజమో కానీ మొత్తానికి ఈ టైటిల్ విషయంలో అయితే ఫాన్స్ నుంచి అంతగా పాజిటివ్ రియాక్షన్స్ అయితే రావడం లేదు. పెద్ది అనే టైటిల్ చాలా ఓల్డ్ గా ఉంది అని ఈ టైటిల్ అంతగా కిక్ ఇవ్వడం లేదు అనే విధంగా సోషల్ మీడియాలో రియాక్ట్ అవుతున్నారు.